

7న చంద్రబాబు పోలవరం రాక

ఏర్పాట్లను పరిశీలించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - పోలవరం

సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7న టిడిపి అధినేత చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు నేతలు ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించారు. పోలవరం ప్రాజెక్ట్ సందర్శన అనంతరం నిర్వాసితులతో పట్టిసీమలోని యామిని కళ్యాణ మండపంలో సమావేశం అవుతారని శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవియాదవ్, పాలి ప్రసాద్, పారేపల్లి రామారావు, మొగపర్తి సొంబాబు, గణపతి రత్తయ్య, గన్నిన సురేంద్రనాథ్ చౌదరి పాల్గొన్నారు.

కూలిన ఇళ్లు.. పరిహారం ఎన్నాళ్లకో..!

2022 వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో కుప్పకూలిన వేలాది ఇళ్లు

ఏడాది గడిచినా ఇంకా 1280 ఇళ్లకు అందని పరిహారం

ఎన్యూమరేషన్ ప్రక్రియ సరిగా చేయలేదని తీవ్ర విమర్శలు

మళ్లీ వరదకు గ్రామాలొదిలి పునరావాస కేంద్రాలకు తరలిన బాధితులు

ప్రభుత్వ తీరుపై వరద బాధితుల్లో తీవ్ర ఆగ్రహం



2022 వరదలకు కుక్కునూరు మండలంలో కుప్పకూలిన ఇల్లు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా మారింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం వరద పరిహారం అందజేతలోనూ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 2022 వరదకు దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన నష్టపరిహారం ఏడాది గడిచిన ఇప్పటికీ అందించలేదు. ఇప్పుడు మళ్లీ విరుచుకుపడిన వరదలకు అప్పట్లో ఇళ్లు కూలిపోయిన బాధితులే పునరావాస కేంద్రంలో కాలం వెళ్లదీస్తున్నారు. 2022 వరదకు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు అల్లాడిపోయారు. రెండు మండలాల్లో 107 నివాసిత ప్రాంతాలుండగా వరదలకు 95 నివాసిత ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. దాదాపు 20 వేల కుటుంబాలకు చెందిన ప్రజలు వరద బాధితులుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు, కొండలు.. గుట్టలపైకి చేరారు. దాదాపు నెల నుంచి మూడు నెలలపాటు పునరావాస కేంద్రాల్లోనూ తలదాచుకున్నారు. పెద్దఎత్తున విరుచుకుపడిన వరదకు రెండు మండలాల్లోనూ వేలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. దెబ్బతిన్న ఇళ్లను కేటగిరీలుగా విభజించి ఎన్యూమరేషన్ చేశారు. దెబ్బతిన్న చాలా ఇళ్లను జాబితాలో చేర్చలేదని అప్పట్లో పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. దీంతో రెండోసారి ఎన్యూమరేషన్ చేసినప్పటికీ అర్హులకు న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. దెబ్బతిన్న గుడిసెకు రూ.పది వేలు, పూర్తిగా దెబ్బతిన్న కచ్చా, పక్కా ఇంటికి రూ.95,100, పాక్షికంగా దెబ్బతిన్న ఇంటికి రూ.3,200, పాక్షికంగా దెబ్బతిన్న పక్కా ఇంటికి రూ.5,200 చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం నిర్ణయించింది. ప్రభుత్వం లెక్క తేల్చినా జాబితాలో ఉన్న 1,280 దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన పరిహారం ఇప్పటికీ అందలేదు. ఇంకా జాబితాలో చోటు దక్కని వారు పెద్దసంఖ్యలో ఉన్నారు. గతేడాది పరిహారం అందకుండానే ప్రస్తుతం మళ్లీ వరద పోటెత్తడంతో అప్పట్లో నష్టపోయిన బాధితులే పునరావాస కేంద్రాల్లోకి తరలొచ్చారు. దెబ్బతిన్న ఇళ్లు పున:నిర్మించుకోవడానికి ఒక్కో కుటుంబానికి అప్పట్లో దాదాపు రూ.50 వేలు వరకూ ఖర్చయింది. ప్రభుత్వం నుంచి మాత్రం రూపాయి సాయం కూడా అందలేదు. ఇచ్చిన పరిహారం లెక్కలు చెబుతున్నారే తప్ప.. ఇంకా లబ్ధిదారులకు చేరని పరిహారం గురించి అధికారులు మాట్లాడని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు మళ్లీ వరదకు చాలా ఇళ్లు దెబ్బతిన్న పరిస్థితి ఉంది. గతేడాది దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన పరిహారం వెంటనే బాధితులకు అందించడంతోపాటు ఈ ఏడాది దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ నిష్పక్షపాతంగా చేయించాలని అంతా కోరుతున్నారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిహారం ఇప్పటికీ అందలేదు..



వేల్పూరు సుజాత, మార్కెట్ సెంటర్, వేలేరుపాడు మండలం

గతేడాది వరదలకు ఇల్లు కూలిపోయింది. శివకాశీపురంలోని ఆశ్రమ బాలిక పాఠశాలలోని పునరావాస కేంద్రంలో మూడు నెలలు ఉండిపోయాం. ఇల్లు మళ్లీ నిర్మించుకోవడానికి రూ.50 వేలు ఖర్చయ్యింది. ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందలేదు. మళ్లీ వరద పోటెత్తడంతో పునరావాస కేంద్రంలోనే ఉంటున్నాం. దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన పరిహారం వెంటనే అందించాలని కోరుతున్నాం.

దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం లేదు.. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వరు..



నగిరిగంటి నాగమణి, వేలేరుపాడు మండలం

2022 వరదలకు ఇల్లు పడిపోయింది. నష్టపరిహారం ఇప్పటికీ అందలేదు. నెలలు తరబడి పునరావాస కేంద్రంలోనే ఉన్నాం. మళ్లీ వరదలు రావడంతో పునరావాస కేంద్రానికి చేరాం. దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వడం లేదు. మరోపక్క ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వరు. ఈ బాధలు పడలేకపోతున్నాం. మాకు న్యాయం చేయాలి.



నినదిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు జీతాలివ్వాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బదిలీలై జీతాలు రాని ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రెండు నెలల క్రితం ప్రభుత్వం నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది ఉపాధ్యాయులకు ఇప్పటికీ జీతాలు చెల్లించకపోవడం విద్యాశాఖ వైఫల్యమని యుటిఎఫ్ నాయకులు అన్నారు. పిజిటిలుగా బదిలీ పొందిన ఉపాధ్యాయులకు, పోస్టులు సర్దుబాటు వల్ల బదిలీ పొందిన ఉపాధ్యాయులకు, కొన్ని పాఠశాలలకు కొత్తగా హెచ్ఎం పోస్టులు ఇవ్వడం వల్ల కొంతమంది ఉపాధ్యాయులకు, అలాగే కొన్ని ఉన్నత పాఠశాలల్లో డ్రాయింగ్ ఆఫీసర్ లేక వంటి కారణాలతో జిల్లాలో సుమారు 200 మంది వరకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలామంది ఉపాధ్యాయులు పిల్లల చదువుల కోసం, బ్యాంకుల్లో తీసుకున్న ఇంటి రుణాల కోసం ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవికుమార్, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, ఆడిట్ కన్వీనర్ మోహన్‌రావు, జిల్లా కార్యదర్శులు సుధారాణి, రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌టియు ఆధ్వర్యాన..

ఏలూరు టౌన్: బదిలీలైన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ ఎస్‌టియు ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద శుక్రవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పిబివిఎంఎల్.నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎం.శామ్యూల్, కెఆర్.పవన్‌కుమార్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ డివిఎవి.ప్రసాద్, నాయకులు బండ్రెడ్డి వాసు, వెంకట్, నాగార్జున, మధు, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నేతలు పాల్గొన్నారు.



నినదిస్తున్న పంచాయతీ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జిల్లా నలుమూలల నుండి పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, 010 ద్వారా వేతనాలు ఇవ్వాలని, కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో పంచాయతీల్లో పగలనక, రేయనక సేవలందిస్తున్న పంచాయతీ కార్మికులకు సక్రమంగా ప్రతినెలా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం తాగునీరు, వీధిదీపాల నిర్వహణ వంటి కీలక పనులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు ఆరు నెలల నుండి 20 నెలలపాటు వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. వేతనాలు లేక కార్మికుల కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు తక్షణం జోక్యం చేసుకుని వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు వాగ్దానం చేసిన విధంగా తక్షణమే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. టెండర్ విధానాన్ని రద్దు చేస్తానని వాగ్దానం చేసిన జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా దాని ఊసెత్తకపోవడం అన్యాయమన్నారు. ఏళ్ల తరబడి పని చేసిన కార్మికులకు ఉద్యోగభద్రత లేకుండా చేస్తున్న టెండర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు బంగారు కృష్ణ మాట్లాడుతూ కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీలో నిధుల్లేక ఎటువంటి రక్షణా పరికరాలు కార్మికులకు అందజేయడం లేదని, దానివల్ల కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక గ్రామాల్లో కార్మికులపై తీవ్ర వేధింపులకు పాల్పడుతున్నారని, తక్షణమే వేధింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆటో యూనియన్ నాయకులు జె.గోపీ సంఘీభావం తెలిపారు. ధర్నాకు యూనియన్ జిల్లా నాయకులు నాగరాజు, వెంకటేశ్వరరావు, ఫణీంద్ర, పుల్లయ్య, రాంబాబు, లక్ష్మి నాయకత్వం వహించారు.

పోలవరం నిర్వాసితులకు కేంద్రం నిధులివ్వాలి

7న ఢిల్లీలో ధర్నాను జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాల్సిన బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని, అందుకు అవసరమైన నిధులు వెంటనే కేంద్రం మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల ఏడో తేదీన ఢిల్లీలో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం పూర్తిగా కల్పించనందువల్లే గోదావరి వరద ముంపు వల్ల ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమంటే ప్రాజెక్టు నిర్మాణం ఒక్కటే కాదని, ఆ ప్రాజెక్టు కోసం త్యాగం చేస్తున్న నిర్వాసితులను కూడా ఆదుకోవాలని, వారికి నష్టపరిహారం, పునరావాసం పూర్తిస్థాయిలో కల్పించాలని హితవు పలికారు. గత సంవత్సరం వచ్చిన వరదలకు ఇంత వరకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదని, ఇప్పుడు మళ్లీ ఈ సంవత్సరం వరదలతో ముంపు గ్రామాల ప్రజలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు గ్రామాల ప్రజలకు చట్టబద్ధంగా అందించాల్సిన నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో అందించి, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నిర్వాసితులను తరలించడం ద్వారానే గోదావరి వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఆ బాధ్యత కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇదే డిమాండ్‌పై జూన్, జులై నెలల్లో సిపిఎం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏలూరు జిల్లాల మీదుగా విజయవాడకు పోలవరం నిర్వాసితుల పోరుకేక పేరుతో మహాపాదయాత్ర నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగానే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించి, నిర్వాసితుల సమస్యలపై పోరాడుతున్న నాయకుల బృందంతో చర్చలు జరిపిందని, తమ పరిధిలో ఉన్న కొన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కాబట్టి దానికి నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదే కాబట్టి ఢిల్లీలో కూడా పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అయితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో మాట్లాడుతుందే తప్ప నిర్వాసితుల పరిహారం, పునరావాస సమస్యలపై మాట్లాడకపోవడం అత్యంత దారుణమని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే పునరావాసానికి అవసరమైన రూ.33 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని రవి డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డిమాండ్ల సాధనకు ఈ నెల ఏడో తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనికి సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీ మిడియం బాబూరావుతోపాటు మరికొంత మంది ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. ఈ ధర్నాలో ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని రవి పిలుపునిచ్చారు.

ఎర్ర కాలువ మిగులు భూములు పేదలకు పంచాలి

ఎపి వ్యకాస ఆధ్వర్యాన పాదయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం



మాట్లాడుతున్న వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణ


ఎర్రకాల్వ మిగులు భూముల్లో పేదల సాగుకు అవకాశం కల్పించి ఏక్‌సాల్ పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. రవి విమర్శించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎర్రకాలువ మిగులు భూముల్లో పేదలు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని, ఈ ప్రాంతంలోని అసైన్డ్, సీలింగ్ భూములను పేదలకు పంచాలని కోరుతూ తలపెట్టిన పాదయాత్రను మండలంలోని మధ్యాహ్నపువారిగూడెంలో ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూపంపిణీ చేస్తామని ప్రకటించి అసైన్డ్ భూముల చట్ట సవరణ చేయడం దుర్మార్గమన్నారు. 9/77 చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. పేదలు, దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వకపోగా ఈ చట్ట సవరణ ద్వారా 20 ఏళ్లు ఎవరైతే ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నారో వారికే పట్టాలిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. కాకులను కొట్టి గద్దలకు పెట్టినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం పేదల చేతుల్లో ఉన్న భూములను భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎర్రకాల్వ మిగులు భూముల పట్ల చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా, పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు స్పందించి పేదలకు, దళితులకు, గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత 30 ఏళ్ల నుండి ప్రభుత్వ భూములను అక్రమంగా, దౌర్జన్యంగా భూములమ్మేసిన భూస్వాములే సాగు చేస్తున్నారని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖాధికారులు పేదలకు అన్యాయం చేస్తూ భూస్వాములిచ్చే లంచాలు మింగి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల క్రితం ఎర్రకాలువ రిజర్వాయర్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు 3500 ఎకరాలు భూసేకరణ చేసిందన్నారు. ఈ భూముల్లో సుమారు మూడు వేల ఎకరాలు మిగులుగా ఉందని, ఆ భూములకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పేదలకు సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. దీనితోపాటు ఏక్‌సాల్ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఎర్రకాలువ మిగులు భూముల్లో పేదలు, దళితులు, గిరిజనులు సాగు చేస్తున్న వారిపై ఇరిగేషన్ అధికారులు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. చట్టాలు ధిక్కరించే వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారుల కనుసన్నల్లోనే భూస్వాములు చట్ట విరుద్ధంగా పామాయిల్, జామాయిల్, కొబ్బరి తదితర వాణిజ్య పంటలు వేసి సాగు చేస్తున్నారని మండిపడ్డారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో లక్షలాది అసైన్డ్, సీలింగ్ భూములను భూస్వాములు కట్టబెట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నారు. 9/77 చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ సవరణకు పూనుకుందన్నారు. భూస్వాములకు రెడ్‌కార్పెట్ పరిచిన విధంగానే వ్యవహరిస్తుందన్నారు. పేదలు సాగు భూములను భూస్వాములకు కట్టబెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహారం ఉందని వ్యక్తం చేశారు. చింతలపూడి, నూజివీడు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో పేదల భూములు ఆక్రమణలో ఉన్నాయన్నారు. ఎవరైతే ఆక్రమించుకున్న భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి మండలాల్లో వందలాది ఎకరాల అసైన్డ్, సీలింగ్ భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మడకం సుధారాణి, అందుగుల ప్రభాకర్, జి.సూర్యకిరణ్, పి.చంటి, స్థానిక నాయకులు బుద్దులు రామలక్ష్మి, బుద్దులు దుర్గ, గంగభవాని, కుంజా చల్లమ్మ, కుంజా అక్కమ్మ, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎవిఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రానికి సెట్‌వెల్ గుర్తింపు

సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డి.మెహర్‌రాజా

ప్రజాశక్తి - ఏలూరు

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా కేంద్రంతో విద్యార్థులు, పేద కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతుందని సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డి.మెహర్‌రాజా అన్నారు. సెట్‌వెల్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన శిక్షణ పొందిన 24వ బ్యాచ్ అభ్యర్థులకు శుక్రవారం సర్టిఫికెట్ల ప్రదానం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్‌డి.మెహర్‌రాజా చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి విజ్ఞాన కేంద్రం కమిటీ కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించగా మెహర్‌రాజా మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ పొందిన వారు ఏ ఉద్యోగం కోసం ప్రయత్నం చేసినా అదనపు అర్హతగా ఉపయోగపడుతుందన్నారు. 13 కంప్యూటర్లతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నేర్పేలా నాలుగు కోర్సుల్లో శిక్షణిస్తూ ఉపాధికి తోడ్పడేలా కృషి చేస్తున్న ప్రిన్సిపల్ ఎం.లక్ష్మి కృషి చేయడాన్ని అభినందించారు. విజ్ఞాన కేంద్రం కమిటీని అభినందించారు. ఇక నుంచి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కమిటీ సభ్యురాలు జి.శారద స్వాగతం పలికారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో సులభ గణిత శాస్త్రం, స్పోకెన్ ఇంగ్లీష్ విజువల్ క్లాసులు త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లో కంప్యూటర్ శిక్షణ కోసం ఆసక్తి గల వారు వినియోగించుకోవాలని కోరారు. విజిఎంవిఆర్.కృష్ణారావు, ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ ఎం.లక్ష్మి మాట్లాడారు. హేలాపురి బాలోత్సవం ట్యూషన్ సెంటర్లో విద్యార్థులకు యాంజీలో దిడ్ల నిర్వహిస్తున్న ట్రేస్ ఇండియా సంస్థ సౌజన్యంతో ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, జోన్ సభ్యులు విజిఎంవిఆర్.కృష్ణారావు చేతుల మీదుగా ఒక్కొక్కరికి రెండు నోటు పుస్తకాలు అందించారు. ఏలూరులో నిర్వహిస్తున్న అన్ని ట్యూషన్ సెంటర్లలో విద్యార్థులకు అందజేస్తామన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న మెహర్‌రాజా

ఆక్వా రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

డాలర్ పంట.. ఆక్వా సాగు నేడు కష్టాల కొలిమిలో చిక్కుకుని నష్టాల వైపు పయనిస్తోందని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, ఫీడ్ ధర ఆకాశానికి ఎగబాకడం, కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంపెడా వ్యాపార సంస్థగా మారిపోవడంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక అన్నే భవనంలో సంఘం జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విదేశీ మారకద్రవ్యం పేరుతో రూ.లక్షల కోట్లు ఆర్జిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా సాగు చేస్తున్న రైతులను పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఆక్వా (రొయ్యలు, చేపలు) రైతులను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అష్టకష్టాలు పడి పంట పండిస్తున్న రొయ్యలు, చేపల రైతులు సరైన ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వంద కౌంట్ రొయ్యలు కిలో రూ.180, రూ.190కు కూడా కొనుగోలు చేసే నాధుడు లేరన్నారు. కిలో ఉత్పత్తికి రూ.200కుపైనే ఖర్చవుతున్నప్పటికీ ధర మాత్రం తక్కువగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వంద కౌంట్ ధరను రూ.240గా నిర్ణయించినప్పటికీ అమలు జరగడం లేదన్నారు. దీనిపై పట్టించుకున్న నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగుమతిదారులందరూ పాడిందే పాటగా కొనుగోళ్లలో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఆక్వా రంగం వల్ల వేల కోట్లు విదేశీ మారక ద్రవ్యం ఆర్జిస్తున్నప్పటికీ ఆక్వా రైతుల కష్టాలను మాత్రం గాలికొదిలేశారన్నారు. ఒకవైపు నాణ్యమైన సీడ్ దొరకక నష్టపోతుంటే, మరో వైపు ఫీడ్ చాలా రకాల్లో నాణ్యంగా ఉండడం లేదని అన్నారు. తక్షణం వంద కౌంట్ ధర రూ.240 నుంచి రూ.250 వరకూ కల్పించి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారు. చేపల రైతులకూ కిలో రూ.130కు మించి ధర లభించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ఆక్వా రైతుల సమస్యలపై దృష్టి సారించి వారిని అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. ఎంపెడా కూడా తన విధానాలను మార్చుకుని రైతులను ఆదుకోవడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నేతలు కట్టా భాస్కరరావు, బొడ్డు రాంబాబు పాల్గొన్నారు.

నారాయణపురం కళాశాలకు హాస్టల్ సౌకర్యం కల్పించాలి

ఎస్ఎఫ్ఐ నేతల వినతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరుతూ సాంఘిక సంక్షేమ జిల్లా అధికారికి ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు కోటదిబ్బ డిగ్రీ కాలేజీ, జూనియర్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో సాంఘిక సంక్షేమ బాలురు, బాలికల కళాశాల హాస్టళ్లు ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో హాస్టళ్లు ఉంటే విద్యార్థులు ఎక్కువ మంది చేరే అవకాశం ఉందన్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఒక్క హాస్టల్ కూడా లేదని, అక్కడ హైస్కూలు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. గ్రామస్తులు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉందన్నారు. అక్కడ హాస్టల్ ఏర్పాటు చేస్తే ఎక్కువ మంది పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యశ్వంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్పి మేరీప్రశాంతి చెప్పారు. డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి, స్వయంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేస్తూ భరోసా కల్పించారు. పలు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారులను ఎస్‌పి ఆదేశించారు.

పోలీస్ వ్యవస్థపై నిరంకుశ వైఖరి వీడాలి : డివైఎఫ్‌ఐ

జంగారెడ్డిగూడెం :నిరంతరం ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడేందుకు శ్రమిస్తున్న పోలీస్ యంత్రాంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరి వీడనాడాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) డిమాండ్ సభ్యులు డిమాండ్ చేసారు. డివైఎఫ్‌ఐ మండల కమిటీ సమావేశం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి డివైఎఫ్‌ఐ మండల అధ్యక్షులు ఎస్.రాజేష్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ పోలీసులకు డిఎ, అలవెన్స్ 15 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వ వైఖరి వీడనాడాలని, లేకపోతే డివైఎఫ్‌ఐ రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు.

6న హమాలీల మహాసభ జయప్రదానికి పిలుపు

జంగారెడ్డిగూడెం :ఆగస్టు ఆరో తేదీన జరిగే హమాలీల ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం డివిజన్ హమాలీల మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారంలో భాగంగా మసీద్ సెంటర్‌లో శుక్రవారం గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెవి.రమణ మాట్లాడుతూ హమాలీలందర్నీ సంఘటితంగా చేసి హక్కుల కోసం ఉద్యమాన్ని బలంగా చేయడానికి డివిజన్ వ్యాప్తంగా హమాలీలకు మహాసభ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ మహాసభకు ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మల సురేష్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఇతర ప్రాంతాల హమాలీ నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మయ్య, దూసరి అబ్బులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి - ముసునూరు

జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని నూజివీడు డివిజనల్ విద్యాశాఖాధికారి సేవియానాయక్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన జూనియర్ కళాశాలలో తొమ్మిది మంది విద్యార్థులు ఉండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రికార్డులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు ఎ.సునీల, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రాంబాబు, వాణి ఉన్నారు.

దళితులపై దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నేతల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. దళితులపై అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన కారంచేడు ఘటన, చుండూరు ఘటనలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టియు) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం ఏలూరు పాత బస్టాండ్ సెంటర్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నాయకులు దుళ్ల వీరనాయుడు, మంగం అప్పారావు, ఎం.రమణ, ఎం.రాము, సూరకాంతం, పల్లి గంగరాజు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సాయం అభినందనీయం

ప్రజాశక్తి - మండవల్లి

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని విద్యలో రాణించాలని ఎంఇఒలు రామారావు, రత్నస్వరూపం అన్నారు. మండలంలోని పెరికెగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలోని 167 మంది విద్యార్థులకు విన్నార్ సిరామిక్స్ కంపెనీ యాజమాన్యం రూ.70 వేల ఆర్థిక సహాయంతో శుక్రవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరికెగూడెం విద్యార్థుల విద్యాభివృద్ధికి విన్నార్ కంపెనీ ముందుకు వచ్చి పుస్తకాలను వితరణగా అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యాశాఖ అధికారులను కంపెనీ యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు శాలువాలతో పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.రామకృష్ణ, హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ వి.శ్రీనివాస్, సిఆర్‌పి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు హీల్ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టుకు 37 మంది హీల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి.సాయిబాబు తెలిపారు. అండర్-13 విభాగంలో 18 మంది, అండర్-15 విభాగంలో 19 మంది ఎంపికైనట్లు చెప్పారు. ఈ పోటీలను జిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ వారు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు ఎంపికైనవారిని హీల్ సిఇఒ కె.అజయ్‌కుమార్, ఫెసిలిటీస్ డైరెక్టర్ టి.భాస్కర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ సుధాకర్, నాగార్జున యూనివర్శిటీ విశ్రాంత పీడీ వై.కిషోర్, హీల్ పిఇటిలు నాగరాజు, ప్రభుదాసు అభినందించారు.

నేరాలు - ఘోరాలు

లైంగిక వేధింపుల కేసులో నిందితునికి జైలు

ప్రజాశక్తి - కైకలూరు

వివాహితను లైంగిక వేధింపులకు గురి చేసిన కేసులో నిందితునికి 18 నెలలు జైలు శిక్ష విధించారు. కైకలూరు న్యాయస్థానంలో శుక్రవారం జరిగిన కేసు విచారణలో వాదనల అనంతరం న్యాయమూర్తి బి.శ్రీనివాసరావు ఇస్లాంపేటకు చెందిన అబ్దుల్ సత్తార్ అనే వ్యక్తిపై నేరం రుజువు కావడంతో శిక్ష వేశారు.

ఎల్ఎన్‌డిపేటలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ఎల్ఎన్‌డి పేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో సంభవించిన అగ్నిప్రమాదంలో చిక్కాల వీర్రాజుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు చిక్కాల వీర్రాజు వాపోయాడు. పోలవరం తహశీల్దార్ బి.సుమతి, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి బాధిత కుటుంబసభ్యులు పరామర్శించారు. ఎంపిపి రూ.ఐదు వేల సాయం, తహశీల్దార్ బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. అగ్ని ప్రమాదంలో సగం కాలిపోయిన రూ.500 నోట్లు రూ.75 వేలు ఉన్నాయని, వాటిని రిప్లేస్ చేసే అవకాశం ఉంటే చేయాలని దొండపుడి బ్యాంక్ మేనేజర్‌కు లెటర్ పెట్టి రిక్వెస్ట్ చేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

వ్యక్తిపై సుత్తితో దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

వ్యక్తిపై సుత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని మీర్జాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామంలో తాపీ పని చేస్తున్న చక్రవర్తికి స్టాలిన్ అనే వ్యక్తికి మాట మాట పెరగడంతో చక్రవర్తిపై స్టాలిన్ సుత్తితో దాడి చేశారు. ఈ దాడిలో గాయాలపాలైన చక్రవర్తిని స్థానికులు నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రెండు పశువులు మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో పడిపోయిన విద్యుత్ స్తంభం వల్ల షాక్‌కు గురై రెండు పశువులు శుక్రవారం మృతి చెందాయి. విద్యుత్ స్తంభం పడిపోయిందని 15 రోజుల క్రితమే అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పశువుల యజమాని మంద కృష్ణకుమారి వాపోయింది. రెండు పశువులు రూ.2.20 లక్షల విలువ చేస్తాయని తెలిపారు.

అంబులెన్సులోనే ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్సులోనే ప్రసవమైంది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మండలంలోని తూర్పు రేగులగుంట గ్రామానికి చెందిన కె.బాలకృష్ణ భార్య సావిత్రికి ఉదయం 5:30 గంటలకు పురిటి నొప్పులు మొదలు కావడంతో బుట్టాయగూడెం ఏరియా ఆసుపత్రికి బాలకృష్ణ ఫోన్ చేసి అంబులెన్స్ పంపించమని కోరగా లేదని సిబ్బంది సమాధానం చెప్పారు. వెంటనే అతను ఒక కారు మాట్లాడుకుని ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఆన్‌డ్యూటీలో ఉన్న డాక్టరు గైనకాలజిస్ట్, స్టాఫ్‌నర్స్ ఇద్దరు ఇక్కడ చికిత్స చేయడం కుదరదని, జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తీసుకెళ్లాలని కనీసం పేషెంట్‌ని చూడకుండా చెప్పారు. భయంతో గర్భిణి భర్త, మామగారు అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి బయలుదేరారు. జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గమధ్యంలో పెద్దపెద్ద గోతులు ఉండటంతో కృష్ణాపురం దాటిన తర్వాత శిశువు సగం బయటకు రావడంతో అంబులెన్స్‌ను పక్కగా ఆపి పురుడు పోశారు. అనంతరం తల్లీ బిడ్డను బుట్టాయగూడెం ఆసుపత్రికి తీసుకెళ్లారు. మార్గమధ్యంలో డెలివరీ సమయంలో తల్లికి గాని బిడ్డకు గాని ఏ విధమైన హాని జరిగినా సిబ్బంది బాధ్యత వహిస్తారా, వారి నిర్లక్ష్యానికి ప్రభుత్వం, డిప్యూటీ డిఎంహెచ్ఒ, అధికారులు స్పందించాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల నాయకులు టి.బాబూరావు, న్యాయవాది పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్యాంబాబు డిమాండ్ చేశారు. ఏజెన్సీ మండలమైన బుట్టాయగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని, ప్రధాన వైద్యులు సమయానికి



అంబులెన్సులో శిశువుతో బంధువులు, ఆశావర్కర్

ప్రజలకు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా, బాధ్యత రహితంగా వ్యవహరించిన వారిని తక్షణమే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం ఏరియా ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంకును ఏర్పాటు చేయాలని, డెలివరీలను రిఫర్ చేయకుండా ఇదే ఆసుపత్రిలో నిర్వహించాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కిషోర్‌నాయక్ విధులు సక్రమంగా నిర్వర్తించడంలేదని, విధులకు హాజరు కావడం లేదని, ఆయన పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నారాయణపురంలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం టూరింగ్‌పేటలో అద్దె ఇంట్లో ఉంటున్న వ్యక్తి గురువారం రాత్రి హత్యకు గురైన సంఘటన సంచలనంగా మారింది. సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరి జిల్లా చంద్రగిరికి చెందిన కురిపాటి చంద్రశేఖర్ (39) బీటెక్ చదివి నారాయణపురం టైల్స్ పరిశ్రమ గ్లేజీలైన్ విభాగంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో భార్య భువనేశ్వరి, కుమారుడు సిద్ధార్థ, కుమార్తె నిత్యశ్రీలతో కలిసి స్థానిక టూరింగుపేటలో ఓ అద్దె ఇంట్లో కింద పోర్షన్‌లో ఉంటూ ప్యాక్టరీ విధులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో పైపోర్షన్‌లో ఉంటున్న ఇంటి ఓనరును లేపి తన భర్తను ఎవరో ముగ్గురు ముసుగు దొంగలు వచ్చి బెడ్ రూమ్‌లోనే హత్య చేసినట్లు చెప్పింది. వెంటనే ఇంటి యజమాని చేబ్రోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన చేబ్రోలు ఎస్ఐ స్వామి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మెడపై అనేక చోట్ల బలమైన ఆయుధంతో దాడి చేసి పీక కోసేసి రక్తం మడుగులో మృతదేహం ఉంది. నిడమర్రు సిఐ ఎంవి.సుభాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని తనదైన శైలిలో కేసును దర్యాప్తు ప్రారంభించారు. భార్య భువనేశ్వరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసుల జాగిలం కొంత దూరం వెళ్లి వెనక్కి వచ్చేసింది. ఏలూరు నుంచి క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించి వెళ్లారు. పోలీసుల విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. హత్యకు పక్కాగా ప్లాన్ వేశారా....ఎంత మంది నిందితులు న్నారు.. భార్యా భర్తలకు ఏమైనా మనస్పర్థలు ఉన్నాయా.. అనే విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని, జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలపై విచారణలో కొంత పురోగతి సాధించామని, త్వరలోనే కారకులను అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డిప్యూటీ తహశీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఆర్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

తండ్రి మృతి... తల్లి జైలు.. ఆందోళనలో చిన్నారులు

ఒక్క పక్క తండ్రి హత్య.. మరో పక్క తల్లి పోలీసుల విచారణలో ఉన్న కారణంగా వారి కుటుంబ సభ్యులెవరూ స్థానికంగా లేకపోవడంతో పిల్లలు ఒంటరిగా మారారు. చిత్తూరు జిల్లాలో ఉన్న రక్త సంబధీకులకు పోలీసులు సమాచారం అందించారు. భువనేశ్వరి తమ్ముడు విశాఖలో బీటెక్ చదువుతున్నాడు. తన బావ చంద్రశేఖర్ మృతి చెందారన్న విషయం తెలుసుకుని విశాఖ నుంచి నారాయణపురానికి శుక్రవారం వచ్చారు. అతని నుంచి పోలీసులు పలు విషయాలను ఆరా తీసి ఆ ఇద్దరు పిల్లలను మేనమామైన రాజుల హేమంత్‌కుమార్‌కు అప్పగించారు. 2013లో పెద్దలు కుదర్చిన కులాంతర వివాహాన్ని చేసుకున్న చంద్రశేఖర్, భువనేశ్వరి మధ్య మనస్పర్థలు ఉన్నాయని, ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువకుడితో భార్యకు వివాహేతర సంబంధాల కారణంగానే ప్రియుడి సాయంతో ఈ హత్య జరిగిందని అంతా అనుమానిస్తు న్నారు. పోలీసుల దర్యాప్తులో పూర్తి విషయాలు వెల్లడి కావాల్సి ఉంది. పోలీసులు విచారణ వేగవంతం చేస్తున్నారు.

నేడు ఏలూరుకు పోరుయాత్ర : ఐద్వా

ప్రజాశక్తి - ఏలూరు

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర పోరుయాత్ర శనివారం ఉదయం ఏలూరు నగరంలో పర్యటిస్తుందని జిల్లా కన్వీనర్ పి.హైమావతి తెలిపారు. శుక్రవారం ఊదో జిల్లా కార్యాలయంలో మహిళల హింసపై రాష్ట్ర పోరుయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడారు. ఐద్వా ఆధ్వర్యంలో శ్రీకాకుళం నుండి ఒక యాత్ర హిందూపురం నుండి రెండో యాత్ర జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర నాయకురాలు గాళ్ల శారద, ఎస్.రాణి, ఆర్.శైలజ, ఎస్.కళావతి, ఎం.మరియా, కె.సత్యవతి, ఆర్.స్వప్న, బి.వరలక్ష్మి, బి.గీత, పద్మ, సత్యవతి, రమణమ్మ, గౌరమ్మ, జి.ఏసుబాబు, మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

125 యూనిట్ల కోళ్లు అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ బుట్టాయగూడెం మండల సమైక్యకు 125 యూనిట్ల కోళ్లను ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు చేతులమీదుగా అందించారు. ఈ 125 యూనిట్ల కోళ్లను మండలంలోని 54 గ్రామ సంఘాల్లోని 125 మంది బెనిఫిషర్లకు ఒక్కో యూనిట్ ధర రూ.4450 కాగా మొత్తం రూ.556250 విలువైన కోళ్లను ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు మండల పరిషత్ కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, వైస్ ఎంపిపి గంగులోతు మోహన్, వేణుగోపాల్ రెడ్డి, ఎపిఎం పద్మావతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని, వైద్యసిబ్బంది విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు సూచించారు . స్థానిక వెంకటాపురం వైఎస్ఆర్ కాలనీలో డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఇతర వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. స్థానిక వైఎస్ఆర్ కాలనీలో ఈగలు, డ్రెయినేజీ, మంచినీటి సరఫరా సమస్య జిల్లా అధికారి దృష్టికి తీసుకురాగా మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఎంపిహెచ్ఇఒ రామాంజనేయులు, బసవరాజు ఎంపిహెచ్ఎస్ కిరణ్, ఎఎన్ఎం దివ్య, హెల్త్ అసిస్టెంట్స్ రమేష్, శ్రీనివాస్, తిలక్ పాల్గొన్నారు.

25 నుంచి చేతి వృత్తిదారుల జిల్లా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చేతి వృత్తిదారుల జిల్లా శిక్షణా తరగతులు 25, 26, 27 తేదీల్లో ఏలూరులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించాలని చేతివృత్తిదారుల జిల్లా సమావేశం నిర్ణయించింది. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పత్తిపాటి రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. తొతలు మణిపూర్ మారణ హోమంలో చనిపోయిన వారికి, హర్యానాలో మతోన్మాదుల మారణ హోమంలో చనిపోయిన వారికి, ఇటీవల కాలంలో ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులు, రైతులు, చేనేత కార్మికుల మృతికి సమావేశం సంతాపం తెలిపారు. చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. .

బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - పోలవరం

పంచాయితీ పారిశుధ్య కార్మికుల జీతాల బకాయిలు చెల్లించాలని పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు. పోలవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సమస్యల సాధన కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు వారాపోసి, వారా నాని, ఫణీంద్ర, వారా నరేష్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వరి పొలాల్లో శాస్త్రవేత్తల పరిశీలన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా చేసి యూరియా, ఎంఒపి పిచికారీ చేయాలని ఏలూరు ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణికుమార్, మార్టేరు ప్రధాన శాస్త్రవేత్త ఎం.రామభద్రరాజు, ఉండి కెవికె శాస్త్రవేత్త బి.రజిత తెలిపారు. మండలంలోని పుట్లగట్లగూడెం వరి పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

'ప్రజాధనం దోచేస్తున్న వైసిపి'

ప్రజాశక్తి - ముసునూరు

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కాకుండా వ్యాపారవేత్తగా వ్యవహరిస్తూ ప్రజాధనం దోచుకుంటున్నారని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. మండలంలోని వలసపల్లిలో శుక్రవారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం భవనాలకు వైసిపి రంగులు వేసి వందల కోట్లు ప్రజాధనం వృధా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘుబాబు, పార్టీ గ్రామ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర, నెరుసు సత్యనారాయణ, నెరుసు శ్రీనివాసరావు, లక్కపాము కాంతారావు, సుహాసని, మోహన్‌రావు పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయం'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని 12వ వార్డులో టిడిపి నేతలు మహిళా శక్తి ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు యానమాదాల ఉషారాణి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

వరద బాధితులకు సాయం పంపిణీకి ప్రత్యేక బృందాలు

కుక్కునూరు :వరద బాధితులకు ఆర్థిక సహాయ పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ మండలాల తహశీల్దార్ల పర్యవేక్షణలో వేసిన బృందాలు కుక్కునూరు వచ్చినట్లు ఐటిడిఎ పిఒ జివివి.సత్యనారాయణ తెలిపారు. మండలంలో ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. మండలంలోని తొమ్మిది గ్రామాల్లో 1385 కుటుంబాలకు రూ.26.8 లక్షల ఆర్థిక సహాయాన్ని యుద్ధ ప్రాతిపదికన లబ్ధిదారులకు అందించే ప్రక్రియను చురుకుగా కొనసాగిస్తున్నామని చెప్పారు. 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు,2 కిలో వంటనూనె, కూరగాయలు అందించినట్లు చెప్పారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు వేగవంతం చేశామని తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసరాలు

మండల పరిధిలోని కివ్వాక పునరావాస కేంద్రంలోని గోదావరి వరద బాధితులకు టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చేతులమీదుగా బంగాళదుంపలు, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కోడిగుడ్లు పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఉన్న బాధితుల సమస్యలు తెలుసుకుని మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఐటిడిఎ పిఒ సత్యనారాయణకు వరద బాధితుల సమస్యలు వివరిస్తూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు మధుర వెంకటరమణ, ఏలూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు కుచ్చర్లపాటి అప్పలరాజు, కోటగిరి సత్యనారయణ, భూపతి కృష్ణరాజు, ఉపసర్పంచి పిచ్చుక రాజు, పులి శ్రీను, కంటిపల్లి రామకృష్ణ, నకిరకంటి భాస్కరరావు, దండాబత్తుల నరసింహరావు, ఎ.బాలాజీ, కుక్కునూరు మురళీ మోహన్, వనమా భాగ్యలక్ష్మి, పిచ్చుక హరిబాబు, పాదం రాము పాల్గొన్నారు.

తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతాడని ఏలూరు అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవిందరావు సూచించారు. వెంకటాపురం వైఎస్ఆర్ కాలనీ గ్రామంలో జరుగుతున్న తల్లిపాల వారోత్సవముల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్, ఎఎన్ఎంలు దివ్య, హెల్త్ అసిస్టెంట్ రమేష్, శ్రీనివాస్, తిలక్ పాల్గొన్నారు.

భీమడోలు :ఐసిడిఎస్ భీమడోలు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల భాగస్వామ్యంతో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషకాల కిట్ల పంపిణీ, డ్రై డే కార్యక్రమాలను నిర్వహించారు. భీమడోలు సెక్టార్ నాయకురాలు స్వర్ణకుమారి, సెక్టర్ పర్యవేక్షకులు షెహనాజ్ బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, భీమడోలు సర్పంచి ఛాంబర్ అధ్యక్షురాలు పి.సునీతమాన్‌సింగ్ పాల్గొన్నారు. గర్భిణులకు, బాలింతలకు ఐసిడిఎస్ కేటాయించిన కిట్లను అందించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు బాలామృతం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీలక్ష్మి పాల్గొని మాట్లాడారు. అనంతరం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు భీమడోలు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

చింతలపూడి :పేద మహిళల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి నవజాత శిశువులు, మాతాశిశుమరణాల రేటును తగ్గించడానికి సిఎం జగన్ వైఎస్ఆర్ సంపూర్ణపోషణ పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని చింతలపూడి ఎంపిపి డాక్టర్ బి.రాంబాబు అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి, ప్రగడవరం పంచాయతీ ముక్కంపాడు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ కిట్లను శుక్రవారం అందించారు. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అధ్యక్షతన గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి తెల్లం వెంకయ్యమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, ఎంపిపి కారం శాంతి, బుట్టాయగూడెం మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి మండల కన్వీనర్ రత్నాజీ, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, ఎంపిడిఒ వేణుగోపాల్ రెడ్డి, జిసిసి స్టేట్ డైరెక్టర్ తెల్లం చిన్నారావు, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఈ.తులసి సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నల్లమాడు సర్పంచి గౌతు రాము కోరారు. రామచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, టేక్ హోమ్ రేషన్‌లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు బియ్యం, పప్పు, ఆయిల్, పాలు, బాలామృతం అందించారు. ఎంపిటిసి సభ్యులు శ్రీను పాల్గొన్నారు. నారాయణపురంలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహికంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

మండవల్లి : స్థానిక నాగేంద్ర స్వామి వారి దేవస్థానంలో టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, సర్పంచి మెండ ఝాన్సీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గర్భిణులకు, బాలింతలకు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం సిడిపిఒ ఆనంద్‌ను దుశ్శాలువాలతో పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు కల్పవల్లి, వార్డ్ మెంబర్లు గుడివాడ మురళి, బొమ్మన బోయిన స్వాతి, సురేష్ పాల్గొన్నారు. ప్రత్తిపాడులో సర్పంచి బేతపూడి ఏసేబురాజు, కానుకొల్లులో సర్పంచి నాగదాసి థామస్ చేతుల మీదుగా టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని వేగవరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి కొదమ జ్యోతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ ఛైర్మన్ వందనపు సాయిబాలపద్మ, సర్పంచి లక్కబత్తుల నాగరాజు, జెడ్‌పిటిసి సభ్యులు పి.బాబ్జి, ఎంపిటిసి సభ్యులు పి.శ్రీను, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని గూటాల గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టెక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొని పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి, ఎఎన్ఎం ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య బృందం పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలపై ప్రత్యేక వైద్య బృందం శుక్రవారం పరిశీలించింది. వైద్య బృందం ప్రతినిధి రీఛార్జ్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎడ్ల రమణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం జిల్లా స్థాయి నుంచి గ్రామీణ స్థాయి ఆసుపత్రుల పరిశీలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

11న దళితుల ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఈ నెల 11వ తేదీన నూజివీడులో దళితుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ కలపాల సురేష్ బాబు తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీల్లోని దళితులు నిత్యం అవమానాలకు గురిగావటం శోచనీయమన్నారు. అన్ని దళిత వర్గాల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసుకొని భవిష్యత్ కార్యక్రమాన్ని తెలియపరుస్తామని చెప్పారు.